భీమవరం **ఉష్ణోగ్రతలు**

గరిష్ఠం : 35.0 - కనిష్ఠం : 26.0

తణుకు : 36.0 - 26.0



## గాంధీ మార్గం అనుసరణీయం

మహాత్మా గాంధీ మార్గం అనుసరణీయమని, నేటి యువత వారి స్ఫూర్తితో ముందడుగు వేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. బుధవారం గాంధీజీ జయంతి పురస్కరించుకుని భీమవరం పట్టణంలోని పాత బస్టాండ్ సెంటర్ బాంబే బేకరీ ఎదురుగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గాంధీ విగ్రహానికి ఆమె పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహాత్ముని ఆదర్శాలను అనుసరిస్తూ శాంతి, సమానత్వం, మతసామరస్యాన్ని పాటిస్తూ ముందుకు సాగాలని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అన్నారు. మహాత్మా గాంధీజీ, లాల్ బహదూర్‌శాస్త్రి జయంతి సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసిన నివాళులర్పించారు.

- భీమవరం టౌన్/భీమవరం క్రైం



## జై దుర్గాభవానీ

- నేటి నుంచి శరన్నవరాత్రులు
- అమ్మవార్ల ఆలయాలు ముస్తాబు

భీమవరం టౌన్ : దేవీ శరన్నవర్రాతులు గురువారం నుంచి పన్నెండో తేదీ వరకు వైభవంగా నిర్వహించేందుకు అమ్మవార్ల ఆలయాలు ముస్తాబు అయ్యాయి. జిల్లాలోని దేవదాయ ధర్మదాయశాఖ ఆధ్వర్యంలో ఆలయాలకు విద్యుద్దీపాలంకరణలు చేశారు. తొమ్మిది రోజులపాటు పలు అంకరణల్లో అమ్మవార్లు భక్తులకు దర్శనమిస్తారు.






# కూటమి కల వాటర్ గ్రిడ్

## గత టీడీపీ ప్రభుత్వంలో ప్రతిపాదనలు

చుట్టూ నీరున్నా.. తాగడానికి గుక్కెడు నీళ్లు కరువు. జిల్లా పేరు వింటే మనసు పులకిస్తుంది. పుణ్యనది ప్రవహించే పశ్చిమ గోదావరి జిల్లాగా ఖ్యాతి పొందింది. జీవనది గడ్డ ఇది. అయినా తాగడానికి నీరు కొనుగోలు చేసుకుంటున్నారు. పట్టణాలు, పల్లెల్లో ఇప్పుడు ప్రైవేట్ వాటర్ ప్లాంట్‌లు వెలిశాయి. రక్షిత మంచినీరు లభ్యం కాకపోవడంతో భూగర్భజలాలను వడిసి పట్టి తాగుతున్నారు. అదే గోదావరి జలాలు దాహార్తిని తీర్చలేకపోతున్నాయి. ఈ సమస్యను అధిగమించేందుకు గత తెలుగుదేశం ప్రభుత్వం వాటర్ గ్రిడ్ పథకాన్ని ప్రవేశపెట్టింది. పైప్‌లైన్ల ద్వారా గ్రామాలకు తరలించేందుకు చర్యలు చేపడుతోంది.

- (భీమవరం-ఆంధ్రజ్యోతి)

కేంద్ర ప్రభుత్వం సహకారంతో గోదావరి జలాలను శుద్ధిచేసి పైప్‌లైన్‌ల ద్వారా నేరుగా గ్రామాలకు తరలించాలని టీడీపీ ప్రభుత్వం సన్నాహాలు చేసింది. డెల్టా, మెట్ట ప్రాంతాలకు గోదావరి నీటిని పంపిణీ చేసేలా రూ.3,800 కోట్లతో ప్రణాళికలు సిద్ధం చేసింది. అంతలో ప్రభుత్వం మారిపోయింది. వైసీపీ ప్రభుత్వం 2019 అధికారంలోకి వచ్చిన తర్వాత వాటర్ గ్రిడ్ పథకాన్ని కుదించారు. దాదాపు రూ.1,460 కోట్లతో పశ్చిమగోదావరి జిల్లాలోని ఏడు నియోకవర్గాలకు మంచినీరు సరఫరా చేసేలా చర్యలు తీసుకుంది. వైస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా 2021లో నరసాపురం విచ్చేసినప్పుడు వాటర్ గ్రిడ్‌ను బటన్ నొక్కి ప్రారంభించారు. పనులకు శ్రీకారం చుడుతున్నట్టు ప్రకటించారు. గత జనవరిలో మెగా సంస్థ వాటర్ గ్రిడ్ పథకానికి ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. కానీ అంతకుముందే జగన్‌మోహన్ రెడ్డి పనులు ప్రారంభించినట్టు ప్రకటించారు. ఇలా జిల్లా ప్రజలను మోసం చేశారు. ఒప్పందం చేసుకున్న తర్వాత కూడా మెగా సంస్థ పనులు ప్రారంభించలేదు. ప్రభుత్వం కనీస నిధులు మంజూరు చేయలేదు. ఇప్పటికీ పనులు నోచుకోవడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో జనంలో ఆశలు చిగురించాయి. వాటర్ గ్రిడ్ పథకంపై ఎమ్మెల్యేలు కూడా హామీలు ఇచ్చారు.

### వాటర్ గ్రిడ్ ప్రణాళిక ఇదే

గోదావరి నుంచి శుద్ధి చేసిన జలాలను నేరుగా గ్రామాల్లో పంచాయతీ షంపుల్లోకి పైప్‌లైన్ ద్వారా సరఫరా చేస్తారు. అక్కడ నుంచి ఓవర్ హెడ్ ట్యాంక్‌కు నీళ్లు పంపింగ్ చేస్తారు. తర్వాత కుళాయిలకు నీటిని విడుదల చేస్తారు. పైప్‌లైన్‌ల వల్ల నీరు కలుషితం అయ్యే అవకాశం ఉండదు. శుద్ధి చేసిన జలాలు నేరుగా కుళాయిల ద్వారా సరఫరా చేసేందుకు అవకాశం ఉంటుంది. ప్రస్తుతం పంట కాల్వలు కాలుష్య కారకాలుగా మారిపోయాయి. పట్టణాలు, పల్లెల్లోని మురుగునీరు పంట కాల్వల్లోకి చేరిపోతోంది. అదేనీటితో గ్రామాల్లోని మంచినీటి చెరువులను భర్తీ చేస్తున్నారు. ఫిల్టర్‌బెడ్‌ల ద్వారా శుద్ధిచేసి సరఫరా చేస్తున్నారు. దీంతో తాగేందుకు ప్రజలు నీటిని వినియోగించుకోవడం లేదు.

- నిధులు మంజూరు
- వైసీపీలో అమలుకాని వైనం
- ఏజన్సీని ఖరారు చేసినా పనులు శూన్యం
- ప్రభుత్వంపై నమ్మకం లేక చేతులెత్తేసిన ఏజన్సీ
- కూటమిపైనే అందరి ఆశలు



కొనుగోలు చేసుకుంటున్నారు. గోదావరి జలాలైతే ఆరోగ్యకరంగా ఉంటాయి. కానీ కాల్వలు కలుషితమయ్యాయి. గోదావరి జలాలు తాగడానికి వినియోగించుకోవడం లేదు. ఫలితంగా కూటమి ప్రభుత్వం వాటర్ గ్రిడ్ పథకాన్ని తెరపైకి తెచ్చింది. విజ్జేశ్వరం నుంచి నరసాపురం, భీమవరం, తాడేపల్లిగూడెం మీదుగా పైప్‌లైన్‌లు వేయనున్నారు. ఒకే చోట భారీ నీటి శుద్ధిప్లాంట్‌ను ఏర్పాటు చేస్తారు. అక్కడ నుంచి గ్రామాలకు నీటిని మళ్లిస్తారు. పైప్‌లైన్‌ల ద్వారా నీటిని గ్రామాల్లో షంపులకు తరలిస్తారు. జిల్లాలో 1,021 ఆవాసాలకు మంచినీటి సౌకర్యం లభించనుంది. జిల్లాలో 2,054 వరకు మంచినీటి సమస్య లేకుండా ప్రణాళికలు రచించారు. వాటర్ గ్రిడ్ పథకంపైనే ఇప్పుడు జిల్లా ప్రజలు ఆశలు పెంచుకున్నారు. కూటమి ప్రభుత్వం కూడా దీనిపై తక్షణ చర్యలు తీసుకోవాల్సి ఉంది.



టీడీపీ జిల్లా అధ్యక్షుడు రామరాజును సత్కరిస్తున్న షరీఫ్, పొత్తూరి

## కలిసికట్టుగా వెళదాం

- కార్యకర్తలకు సంక్షేమ నిధి ఏర్పాటు
- ప్రతి ఒక్కరి చేత సభ్యత్వ నమోదు చేయించాలి
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు

నరసాపురం టౌన్, అక్టోబరు 2: 'కూటమిలో నాయకులు, కార్యకర్తలకు చిన్న చిన్న సమస్యలు వస్తూనే ఉంటాయి, అవన్నీ పార్టీ అధిష్ఠానం చూసుకుంటుంది, మనం మాత్రం కలిసికట్టుగానే వెళదాం.. మీకు అండగా పార్టీ ఉంది.. మీరు పడిన కష్టానికి మంచి ఫలితం త్వరలో వస్తుంది' అని టీడీపీ జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు భరోసా ఇచ్చారు. బుధవారం టీడీపీ కార్యాలయంలో పార్టీ సభ్యత్వ నమోదును ఆయన శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్, ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజులతో కలిసి ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ సభ్యత్వ కార్యక్రమాన్ని బాధ్యతగా చేయాలి, ప్రభుత్వం కార్యకర్తలకు ప్రత్యేకంగా సంక్షేమ నిధిని ఏర్పాటు చేస్తుంది. పార్టీలో కష్టించిన పని చేసేవారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా 80 నామినేటెడ్, ఎమ్మెల్సీ పదవులను అధిష్ఠానం కట్టబెడుతుందన్నారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జిలకు ప్రొటోకాల్‌తో కూడిన పదవులు వస్తాయన్నారు. శాసనమండలి మాజీ చైర్మన్ ఎంఏ షరీఫ్ మాట్లాడుతూ పార్టీని గౌరవించుకుంటూ ముందుకు సాగాలన్నారు. స్థానిక సమస్యల్ని త్వరలో అధిష్ఠానం దృష్టికి తీసుకెళతామన్నారు. ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు మాట్లాడుతూ కార్యకర్తలకు సరైన ప్రాధాన్యత కల్పించేందుకు తనవంతు ప్రయత్నిస్తామన్నారు. గ్రామ, వార్డు స్థాయిల్లో పార్టీ సభ్యత్వాన్ని 30 వేలకు పైగా చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జక్కం శ్రీమన్నారాయణ, కొప్పాడ రవి, పాలూరి బాబ్జీ, కొల్లు పెద్దిరాజు, డాక్టర్ రాజ్యలక్ష్మి, వాతాడి ఉమా, గుబ్బల నాగరాజు, ముత్యాలరావు, సంకు భాస్కర్, తదితరులు ఉన్నారు.



రెండేళ్లుగా నిరుపయోగంగా మిగిలిన కేంద్రీయ విద్యాలయం తాత్కాలిక భవనం

## నూజివీడుకు కేంద్రీయ విద్యాలయం

# మిథ్యేనా ?

## మంజూరై రెండేళ్లయినా కదలిక లేని వైనం

నూజివీడు టౌన్, అక్టోబరు 2 : వైసీపీ ప్రభుత్వంలో నూజివీడులో కేంద్రీయ విద్యాలయం మంజూరైందంటూ దానికి నూజివీడు ట్రిపుల్ ఐటీ వద్ద ఏడు ఎకరాల భూమిని కేటాయించినట్టు ప్రకటించారు. నాటి వైసీపీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఒక అడుగు ముందుకు వేసి కేంద్రీయ విద్యాలయం తక్షణం ప్రారంభించేందుకు నూజివీడు ఎంప్లాయిస్ కాలనీలోని పాత ఎంపీపీ పాఠశాల భవనాలకు సుమారు రూ.70 లక్షలు ఖర్చుచేసి మెరుగులుదిద్ది 2022లో హడావుడిగా ప్రారంభించారు. అయితే తాత్కాలిక భవనాలు ప్రారంభించి రెండేళ్లు పూర్తవుతున్నా నేటికీ నూజివీడుకు కేంద్రీయ విద్యాలయం మాత్రం రాలేదు. భవన నిర్మాణాలు ఇతర వసతుల కల్పనను నాటి వైసీపీ ప్రభుత్వం చేపట్టకపోవడాన్ని చూస్తే నూజివీడుకు కేంద్రీయ విద్యాలయం మిథ్యాలయమేనా..? అనే అనుమానం కలుగుతోంది.

కేంద్ర ప్రభుత్వం 2022లో దేశవ్యాప్తంగా 27 కేంద్రీయ విద్యాలయాలను కేటాయించగా, రాష్ట్రానికి ఎనిమిది మంజూరయ్యాయి. వాటిలో ఉమ్మడి కృష్ణా జిల్లా పరిధిలో ప్రస్తుతం ఏలూరు జిల్లా నూజివీడుకు కేటాయించారు. నూజివీడు ఎంప్లాయిస్ కాలనీలోని ఎంపీపీ పాఠశాలలో తాత్కాలికంగా తరగతులను ప్రారంభించాలని భావించగా, ఆ తర్వాత అడుగులు పడలేదు. దీనిపై అప్పటి నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ న్యూఢిల్లీ వెళ్లి కేంద్రీయ విద్యాలయం కమిషనర్‌ను సైతం కలిసి వచ్చారు. అయినా కేంద్రీయ విద్యాలయం పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారడంతో ఇప్పుడు అసలు ఆ ప్రాజెక్టు అమలులో ఉందా? లేదా? అనే అనుమానాలు కలుగుతున్నాయి.

- వైసీపీ సర్కార్‌లో హడావుడి
- రూ.70 లక్షలతో తాత్కాలిక భవనాల పేరుతో ఎంపీపీ పాఠశాల అభివృద్ధి
- మునిసిపల్ నిధులు వెచ్చించడంపై పలు ఆరోపణలు
- ప్రస్తుతం నిరుపయోగంగా భవనాలు



### తాత్కాలిక భవనాలపై అనేక ఆరోపణలు

కేంద్రీయ విద్యాలయం మంజూరు తర్వాత నూజివీడు ట్రిపుల్ ఐటీ వద్ద ఏడు ఎకరాల భూమిని కేటాయించారు. భవన నిర్మాణాలను ప్రారంభించాల్సిన ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేయలేదు. దీంతో ఎమ్మెల్యే ప్రతాప్ హడావుడిగా నూజివీడు ఎంప్లాయిస్ కాలనీలోని ఎంపీపీ పాఠశాలను కేంద్రీయ విద్యాలయంగా సుమారు 70 లక్షల మున్సిపల్ నిధులు వెచ్చించి అభివృద్ధి చేయించడంపై అనేక ఆరోపణలు ఉన్నాయి. పాత భవనాలను అంత ఖర్చుపెట్టి అభివృద్ధి చేయడం జిల్లా పరిషత్ ఆస్తులకు మున్సిపల్ నిధులు ఖర్చు చేయడం పైన ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాస్తవంగా తాత్కాలిక భవనాల పేరుతో వేసిన రేకుల షెడ్డుకు అంత ఖర్చుపెట్టాల్సిన అవసరం లేదు. మరోవైపు జిల్లా పరిషత్‌కు సంబంధించిన ఆస్తిలో మునిసిపల్ నిధులు ఖర్చు చేయడం పైన అనేక ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. తాత్కాలిక భవనాలకు సంబంధించి చేసిన ఖర్చుపై విచారణ జరపాలని, నాటి వైసీపీ ప్రభుత్వంలో కాంట్రాక్టర్ల స్వలాభం కోసం లక్షలాది రూపాయల నిధులను దుర్వినియోగం చేశారని, ఆ నిధులు నూజివీడు పట్టణంలో వినియోగిస్తే బావుండేదని, సంబంధిత భవన అభివృద్ధి పై విచారణ చేపట్టాలని నాడు టీడీపీ, జనసేన నాయకులు డిమాండ్ చేశారు.

### నిరుపయోగంగా భవనాలు

కేంద్రీయ విద్యాలయం కోసం అభివృద్ధి చేసిన భవనాలు నేటికీ నిరుపయోగంగా ఉండిపోయాయి. కేంద్రీయ విద్యాలయం ప్రాజెక్టు అమల్లో ఉంటే తాత్కాలిక భవనాలను దానికి వినియోగించడం, లేని పక్షంలో మరో కార్యాలయానికి లేదా పాఠశాలకు సంబంధిత భవనాలను వినియోగించడం ద్వారా లక్షలాది రూపాయల ప్రజాధనాన్ని సద్వినియోగం చేయవచ్చని పలువురు పేర్కొంటున్నారు.

### కేంద్రీయ విద్యాలయం వసతులు, సీట్లు ఇలా..

కేంద్రీయ విద్యాలయంలో పాఠ్యాంశాలు సెంట్రల్ సిలబస్‌లో బోధిస్తారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలకు 50శాతం సీట్లు, రాష్ట్రప్రభుత్వ ఉద్యోగుల పిల్లలకు 25శాతం సీట్లు కేటాయించగా, మిగిలిన 25 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల పిల్లలకు కేటాయిస్తారు. ఈ పాఠశాల ఏర్పాటు చేయాలంటే ఏడు నుంచి పది ఎకరాల భూమితో పాటు 20 తరగతి గదులు, క్రీడాస్థలం, సిబ్బంది క్వార్టర్లు ఏర్పాటు చేయాలి. కేంద్రప్రభుత్వం విద్యాలయాన్ని మంజూరు చేస్తే రాష్ట్రప్రభుత్వం స్థలం కేటాయింపు, ఇతర వసతులను కల్పించాలి.



ఇరుకు భవనంలో తాడేపల్లిగూడెం హాస్టల్

# 54 మందికి 4 బాత్‌రూమ్‌లే

## త్రిశంకు స్వర్గంలో సంక్షేమ హాస్టల్స్

- ఏటా కోట్ల రూపాయల అద్దెలు చెల్లింపు
- అరకొర వసతులతో ఇబ్బందులు

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 2: సంక్షేమ హాస్టల్స్ త్రిశంకు స్వర్గంలో కొట్టుమిట్టాడుతున్నాయి. ఓవైపు ఏటా కోట్ల రూపాయల అద్దెలు చెల్లిస్తున్నా అరకొర వసతులతో విద్యార్థులు సరిపెట్టుకోవాల్సి వస్తుంది. జిల్లాలో బీసీ, సాంఘీక సంక్షేమ శాఖల పరిధిలో ఉన్న 67 హాస్టల్స్ ఉండగా అందుల్లో 29 హాస్టల్స్ అద్దె భవనాల్లో ఉంటున్నాయి. నెలకు ఈ హాస్టల్స్‌కు ప్రభుత్వం రూ.12లక్షల 12 వేలు అద్దె చెలిస్తున్నాయి. ఏడాదికి రూ.1.44 కోట్లు ప్రభుత్వం వెచ్చించాల్సిన పరిస్థితి. అయినా విద్యార్థులు ఇరుకు గదుల్లో, మరుగుదొడ్ల వినియోగం కోసం క్యూ కడుతూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెలకొంది.

### విద్యార్థినులకు నిత్యం నరకమే..

ఏటా కోట్లలో అద్దెలు చెలిస్తున్నా సంక్షేమ హాస్టల్స్‌ల్లో విద్యార్థినులు అరకొర వసతులతో నరకయాతన అనుభవించాల్సిన పరిస్థితి. తాడేపల్లిగూడెంలోని బీసీ వెల్ఫేర్ హాస్టల్‌లో 54 మంది కళాశాల విద్యార్థినులు ఉన్నా వారికి ఆరు ఇరుకు గదులు., నాలుగే బాత్‌రూంలు. ఆ విద్యార్థినులకు నిత్యం నరకమే. నేషనల్ హ్యూమన్‌రైట్స్ చైర్‌పర్సన్ విజయభారతి, జేసీ ఆ హాస్టల్స్‌ను భవనాలు మార్చాలని ఆదేశించారు. అదే విధంగా జిల్లాలో హాస్టల్స్ పరిస్థితి ఇదే.

### అద్దెలు ఇలా..

జిల్లాలో సాంఘిక సంక్షేమశాఖ పరిధిలో 38 హాస్టల్స్ ఉండగా పది హాస్టల్స్ అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయి. వాటికి ప్రతీనెలా రూ.4.12 లక్షలు అద్దెను ప్రభుత్వం చెల్లిస్తోంది. అదేవిధంగా బీసీ వెల్ఫేర్ శాఖ పరిధిలో 29 హాస్టల్స్ ఉండగా 19 అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయి. వాటికి ప్రతీనెలా రూ.8 లక్షల అద్దెలు కడుతున్నారు. కానీ సరైన సదుపాయాలు లేక ఇబ్బందులు తప్పడం లేదు.

# ముట్టుకుంటేనే మంట !





- భారీగా పెరిగిన ఉల్లి, వెల్లుల్లి ధరలు
- ఉల్లి కేజీ రూ.70, వెల్లుల్లి రూ.380
- కొనాలంటేనే జంకుతున్న సామాన్యులు

ఏలూరు రూరల్, అక్టోబరు 2 : వంటింటి సరుకులు సామాన్యుల పాలిట భారంగా మారుతున్నాయి. పెరిగిన ధరలతో కొన్నింటిని కొనుగోలు చేయలేని పరిస్థితి నెలకొంది. ఇప్పుడు ఆ జాబితాలో ఉల్లిపాయ, వెల్లుల్లిపాయ చేరింది. ఉల్లిపాయ లేని వంటింటిని ఊహించలేం. కూర వండాలన్నా, పోపు వేయాలన్నా అదే తప్పనిసరి. సాధారణంగా ఉల్లిపాయలను కోస్తుంటే కన్నీళ్ళు వస్తాయి. అటువంటిది ఇప్పుడు అవి కొనాలంటేనే కన్నీళ్లు వస్తున్నాయి. బహిరంగ మార్కెట్లో ఉల్లి ధర రూ.70 దాటేసింది. దాంతో రోజురోజుకు ధర పెరుగుతుండడంతో సామాన్యులు ఉల్లి వాడకాన్ని తగ్గించుకుంటున్నారు.

ఉల్లిపాయ లేకుండా ఏ కూర రుచికరంగా ఉండవు. అవి లేకుండా కూరలు వండాలంటే ఎవరు ఇష్టపడరు. మూడునెలల క్రితం రూ.25 పలికిన ధర నేడు మూడింతలు పెరిగింది. కొత్త పాయలు రూ.60, పాత పాయలు రూ.70కి విక్రయిస్తున్నారు. వరుసగా పండుగలు, శుభ కార్యాలు ఉండడంతో మరింత పెరిగే సూచనలు కనిపిస్తాయి. భారీవర్షాల వల్ల ఉల్లిసాగు తగ్గి దిగుబడి పడిపోయింది. వ్యాపారస్తులు నాణ్యతను బట్టి ధరలు నిర్ణయిస్తున్నారు. రైతు బజారులో ఒక మోస్తారుగా ఉన్న రిటైల్ మార్కెట్లో అధిక ధరలకు అమ్ముతున్నారు. హోల్‌సేల్ వ్యాపారులు సైతం ఇతర రాష్ట్రాల పై ఆధార పడాల్సి వస్తోంది. ఉల్లిగడ్డలు పండించే కర్నూలు పంట ఆలస్యమైంది. వర్షాలు పడి పంట చేతికి రాకపోవడానికి సమయం పడుతుంది.

### వెల్లుల్లిదీ అదే దారి

ఉల్లిపాయతో పాటు వెల్లుల్లి ధరలు భారీగా పెరుగుతున్నాయి. కొంతకాలంగా ఆకాశమే హద్దుగా చుక్కలు చూపుతున్నాయి. సామాన్య, మధ్యతరగతి ప్రజలు కొనలేకపోతున్నారు. ఏడాది క్రితం కిలో రూ.100లోపు ఉన్న వెల్లుల్లి ధర ప్రస్తుతం రిటైల్ మార్కెట్‌లో రూ.380కి పెరిగింది. మసాల వంటకాల్లో ప్రధాన అవసరమైన వెల్లుల్లి ధరలు ఇలా పెరగడంతో వినియోగ దారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆరునెలలుగా వెల్లుల్లి ధరలు అదుపులోకి రాకపోవడంతో నెమ్మదిగా సామాన్యుడి వంట ఇంటినుంచి వెల్లుల్లి మాయమయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. డిమాండ్‌కు తగ్గ దిగుబడి లేకపోవడంతో ధరల పెరుగుదలకు కారణమని వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి.

# పంచదార అమ్మకాలతో కమీషన్‌కు ముడి

- ఆందోళనలో రేషన్ డీలర్లు

భీమవరంటౌన్, అక్టోబరు 2 : రేషన్ డీలర్ల కమీషన్‌కు పంచదార, కందిపప్పు అమ్మకాల ద్వారా వచ్చే దానితో ముడిపెట్టడంతో రేషన్ డీలర్లు ఇబ్బందులు పడుతున్నారు. మూడు నెలలుగా తమకు కమీషన్ అందక సతమతం అవుతున్నారు. జిల్లాలో 5 లక్షల 27 వేల రేషన్ కార్డులు ఉన్నాయి. ప్రతీనెల బియ్యంతోపాటుగా కందిపప్పు, పంచదార కూడా కార్డుదారులకు అందిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పంచాదార ప్యాకెట్లలో తూకం తక్కువగా ఉందనే ఫిర్యాదులు రావడంతో పంచదార పంపిణీ నిలిపివేశారు. అనంతరం అప్పటికి ఉన్న పంచాదార పంపిణీ చేస్తుండగా.. కొన్ని మండలాలకు పాడైపోయిన పంచదార రావడంతో కార్డుదారులు కొనుగోలుకు ఇష్టపడకపోవడంతో వాటిని తిరిగి డీలర్లు.. ఎంఎల్ఎస్ పాయింట్లకు ఇచ్చేశారు. మళ్లీ ఇప్పుడు అదే పంచదారను ఇచ్చారని, కొన్ని మండలలాకు పంచదార సరఫరా రాలేదని చెబుతున్నారు. వీటి అమ్మకాలతో వచ్చే సొమ్ముతో కమీషన్ తీసుకుందామంటే కొనుగోలు లేకపోవడంతో తమకు కమీషన్ వచ్చే పరిస్థితి లేదని వాపోతున్నారు.



ఎంపీ పురందేశ్వరికి శ్రీవారి చిత్రపటం అందజేస్తున్న ధర్మకర్త నివృతరావు

## డబుల్ ఇంజన్ సర్కార్‌తో సుపరిపాలన

### రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి

ద్వారకాతిరుమల, అక్టోబరు 2: రాష్ట్రంలో గత ఐదేళ్లుగా కుంటుబడిన అభివృద్ధిని డబుల్ ఇంజన్ సర్కార్ గాడిలో పెడుతూ సుపరిపాలన అందిస్తోందని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. ద్వారకాతిరుమలలో రూ.1.50 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు ఆమె గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, మాజీ మంత్రి కెఎస్ జవహర్‌లతో కలసి శంకుస్థాపనలు చేశారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయం వద్ద డ్వాక్రా మహిళలకు చెక్కులు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ గాంధీ జయంతి రోజున ఎన్ఆర్ జీఎస్ నిధుల ద్వారా అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడం ఆనందంగా ఉందన్నారు. ఇటీవల రాష్ట్రంలో సంభవించిన వరదలకు కేంద్రం నుంచి రూ.1400 కోట్లు సాయాన్ని అందించామన్నారు. టీడీపీ నాయకులు లంకా సత్యన్నారాయణ, పోలిన శ్రీను, మల్లిపెద్ది వెంకటేశ్వరరావు, మొగతడకల శ్రీనివాసరావు, డీవీఎస్ చౌదరి, మాజీ జడ్పీటీసీ లక్ష్మీరమణి, దేవరపల్లి రాయుడుబాబు, పాకలపాటి గాంధీ, నాదెళ్ల సురేంద్రనాధ్ చౌదరి, ఏపూరి దాలయ్య, ఓం ప్రకాష్‌చౌదరి, పాతూరి సహృదయ్, కిషోర్, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. ఉదయం చిన వెంకన్న ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు. అర్చకులు వారికి శ్రీవారి శేషవస్త్రాలను అందించి వేదాశీర్వచనం పలికారు.ఆలయ అనువంశిక ధర్మకర్త ఎస్‌వీ నివృతరావు వారికి స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.



శ్రీరామునికిచ్చే ధనుర్బాణాలతో పూజలు జరిపించుకుంటున్న శ్రీనివాసశాస్త్రి కుటుంబ సభ్యులు

## శ్రీవారి సన్నిధిలో అయోధ్య రామయ్య ధనుర్బాణాలు

ద్వారకాతిరుమల, అక్టోబరు 2: అయోధ్య శ్రీరామునికి అందచేసే వెండి ధనుర్బాణాలు బుధవారం రాత్రి చినవెంకన్న సన్నిధికి తీసుకువచ్చారు. హైదరాబాద్‌కు చెందిన చల్లా శ్రీనివాసశాస్త్రి కుటుంబం ఈ ధనుర్బాణాలను ద్వారకా తిరుమలేశుని సన్నిధిలో ఉంచి ప్రత్యేక పూజలు జరిపించారు. 13 కేజీల వెండి, కేజీ బంగారంతో వీటిని తయారు చేయించినట్లు శాస్త్రి తెలిపారు. శాస్త్రి కుటుంబ సభ్యులు ఆలయంలో స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం ఆయనకు ఆలయ అర్చకులు స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి వేదాశీర్వచనం పలికారు.




సమావేశంలో మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు మంజుల

## ఉద్యోగ, ఉపాధ్యాయ వ్యతిరేక నిర్ణయాలపై నిరంతర పోరాటం

### ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు మంజుల

ఏలూరు అర్బన్, అక్టోబరు 2 : పారిశ్రామిక వేత్తలకు అనుకూలమైన నిర్ణయాలు తీసుకుంటూ ప్రభుత్వాలు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లకు తీవ్ర ద్రోహం చేస్తున్నాయని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చెన్నుపాటి మంజుల ధ్వజమెత్తారు. బుధవారం స్థానిక సుబ్బమ్మదేవి మున్సిపల్ హైస్కూలులో నిర్వహించిన ఏపీటీఎఫ్ జిల్లా ఉద్యమ అధ్యయన తరగతుల ప్రారంభ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వాలు ఏవైనప్పటికీ ఏపీటీఎఫ్ తన వైఖరిని మార్చకుండా విద్యారంగ సమస్యలపైనా, ఉపాధ్యాయుల సమస్యలపైనా నిరంతరం పోరాడుతూనే ఉందన్నారు. పెన్షన్, గ్రాట్యుటీ, కమ్యుటేషన్, ఇంక్రిమెంట్ వంటి సౌకర్యాలను సాధించుకోవడం ఏపీటీఎఫ్ వల్లే సాధ్యపడిందన్నారు. సంఘ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి పాండు రంగ వరప్రసాద్ మాట్లాడుతూ పాతపెన్షన్ రద్దు, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ నియామకాలు వంటివన్నీ పారిశ్రామిక వేత్తలకు అనుకూలమైన ప్రభుత్వ నిర్ణయాలేనని విమర్శించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీతాల పెంపుదల ఉండటం లేదన్నారు. పలు తీర్మానాలను ఆమోదించారు. అధ్యయన తరగతుల్లో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామారావు, రెడ్డిదొర, రాష్ట్ర కార్యదర్శి సాల్మన్‌రాజు, సంఘ నాయకులు శ్యాంసుందర్, సోమేశ్వరరావు, దొరబాబు, నారాయణ, రమాదేవి, ప్రకాష్‌రావు, గణేష్, కుటుంబరావు, రంగావలి, మండల, పట్టణ శాఖల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.



శంకుస్థాపన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతమనేని

## కండ్రిగ నరసింహపురంలో బయో గ్యాస్ ప్లాంట్

దెందులూరు, అక్టోబరు 2 : దెందులూరు మండలం కండ్రిగ నరసింహపురం గ్రామ పరిధిలో రూ.300 కోట్లతో హెచ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో నిర్మించనున్న బయో గ్యాస్ ప్లాంట్ శంకుస్థాపన కార్యక్రమంలో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌రావు పాల్గొన్నారు. వర్చువల్ పద్ధతిలో ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు.హెచ్‌పీసీఎల్ కంపెనీ ప్రతినిధులతో చింతమనేని ప్లాంట్ నిర్మాణపనులపై చర్చించారు. అనంతరం ప్లాంట్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. గాంధీ జయంతి సందర్భంగా గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాగంటి నారాయణప్రసాద్, కుచ్చెర్లపాటి పాటేశ్వరావు, పర్వతనేని రామకృష్ణ, వెంకట్రావు, రాజా మోతుకూరి నాని, శ్రీనివాసరావు, మధుబాబు, కంపెనీ ప్రతినిధులు ఉన్నారు









భీమవరం మునిసిపల్ కార్యాలయంలో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి శ్రీనివాసవర్మ, ఎమ్మెల్యే రఘురామ, కలెక్టర్, పారిశుధ్య కార్మికులకు సత్కారం.. ఏలూరులో కార్మికులను సత్కరిస్తున్న కలెక్టర్, జడ్పీ చైర్మన్

# స్వచ్ఛత ఒక ఉద్యమంలా చేపట్టాలి

### కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ

భీమవరం టౌన్, అక్టోబరు 2 : స్వచ్ఛతా కార్యక్రమాలు ఒక ఉద్యమంలా చేపట్టాల్సిన అవసరం ఉందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ అన్నారు. గాంధీ జయంతి పురస్కరించుకొని స్వచ్ఛతా హి సేవ ముగింపు కార్యక్రమం బుధవారం భీమవరం మున్సిపల్ కార్యాలయం ఆవరణంలో నిర్వహించారు.మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఉన్న మహాత్మాగాంధీ విగ్రహానికి మంత్రి శ్రీనివాస్ వర్మ, జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బహదూర్ శాస్త్రి పుట్టినరోజు కూడా కావడంతో వేదిక మీద ఏర్పాటు చేసిన లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వర్మ మాట్లాడుతూ బాపూజీ కలలు గ్రామ స్వరాజ్యం నిర్మాణానికి అందరూ కృషి చేయాలన్నారు. ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాన్ని ప్రారంభించి గ్రామాలకు నిధులు కేటాయించారన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ స్వచ్ఛత అనేది ప్రతి ఒక్కరిలో అంతర్లీనంగా ఉండాలని దానిని అన్ని ప్రాంతాల్లో అమలుకు కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యేలు పులపర్తి రామాంజనేయులు, పితాని సత్యనారాయణ, కనుమూరు రఘు రామకృష్ణ రాజు మాట్లాడారు. అనంతరం స్వచ్ఛతా హి సేవ అవార్డుల ప్రదానం, వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయభాస్కరరావు, అడిషనల్ ఎస్పీ భీమారావు, డిప్యూటీ కలెక్టర్ శివనారాయణరెడ్డి, ఆర్డీవోలు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఖైభవానీ శంకరీ, దాసిరాజు, కమిషనర్ రామచంద్రారెడ్డి, తహసీల్దార్ రాంబాబు, చెరుకువాడ రంగసాయి, కంతేటి వెంకట్రాజు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి

### సత్కరించిన జిల్లా కలెక్టర్, జడ్పీ చైర్‌పర్సన్

ఏలూరు సిటీ, అక్టోబరు 2: స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా పలువురు పారిశుధ్య కార్మికులను జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీలు సత్కరించారు. ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని స్వచ్ఛభారత్‌లో వారి పాత్ర విశిష్టమైనదని కొనియాడారు. జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ సమాజం నిద్ర లేవకముందే గ్రామాలు, నగరాలు, పట్టణాల్లో ఆయా ప్రాంత పారిశుధ్య కార్మికులు స్వచ్ఛభారత్ సంకల్పంతో శుభ్రం చేస్తూ ప్రజల ఆరోగ్య పరిరక్షణలో భాగస్తులవుతున్నారన్నారు.పారిశుధ్య కార్మికులు నీలపు సామ్రాజ్యం, బంగారు చిన్న సీతమ్మ, కనకం నాగశ్రీనివాసరావు, కె.దుర్గారావు, కె.కుమారి, బంగారు శంకర్రావు, బంగారు రాజు, బట్టు బసవరాజు, బట్టు నాగబాబు, బంటి నూకాలమ్మ, తోటకూరి ప్రదీప్‌కుమార్, బొంతు సంజీవ్‌కుమార్, చిన్న రామారావు, సేనాపతి పెద్దిరాజు, దాసు, మారుతీరావు, భాస్కరరావు, బొల్లారపు రాఘవులు, మరియదాసు, కె.వెంకటేశ్వరరావు, వట్లూరు గ్రామ పంచాయతీకి చెందిన నవీన్‌కుమార్, పిల్లా రవి, ఎస్.బాబారావు, తంబీలను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. డీఆర్వో పుష్పమణి, జడ్పీ సీఈవో సుబ్బారావు, డీపీవో శ్రీనివాస విశ్వనాథ్, మున్సిపల్ కమిషనర్ భానూ ప్రతాప్ డీఆర్‌డీఏ పీడీ విజయరాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాని స్వచ్ఛభారత్ సభకు కొత్త పట్టిసీమ సర్పంచ్



ప్రధాని మోదీ సభలో మాట్లాడుతున్న సర్పంచ్ విజయదుర్గ

పోలవరం, అక్టోబరు 2 : మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా ఢిల్లీలో ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన విజ్ఞాన భవన్‌లో బుధవారం జరిగిన స్వచ్ఛభారత్ దివస్ కార్యక్రమంలో కొత్తపట్టిసీమ సర్పంచ్ ఘైగాపుల విజయదుర్గ పాల్గొని పంచాయతీలలో పారిశుధ్య నిర్వహణపై మాట్లాడారు. రాష్ట్రంలో 8 పంచాయతీల నుంచి సర్పంచ్‌లు హాజరయ్యారు. పోలవరం మండలంలో నూతనంగా ఏర్పడిన కొత్త పంచాయతీ కొత్త పట్టిసీమ గ్రామానికి తొలి సర్పంచ్‌గా విజయదుర్గ ఎన్నికవడమే కాకుండా ఆమె ఆధ్వర్యంలో ఉత్తమ పంచాయతీగా ఎంపికవడంతో ప్రధాని సభకు ఆహ్వానం అందింది.

# సీతాఫలం ఔషధాలు పుష్కలం



### మార్కెట్‌ను ముంచెత్తుతున్న సీతాఫలాలు

గణపవరం, అక్టోబరు 2: సీజనల్‌గా లభించే పండ్లలో సీతాఫలాలకు ప్రత్యేక స్థానం ఉంది. ఆరోగ్యపరంగా పేరొందిన సీతాఫలాలు వర్షాలు సమృద్ధిగా పడే కాలంలోనే ఎక్కువగా లభిస్తాయి. ముఖ్యంగా తూర్పు గోదావరి జిల్లా రాజానగరం, రాజమండ్రి, పరిసర మెట్ట ప్రాంతాలు, ఖమ్మం, తదితర ప్రాంతాల నుంచి పుష్కలంగా లభించే సీతాఫలాలను ఉమ్మడి జిల్లాల్లో అధికంగా విక్రయిస్తున్నారు. గణపవరం మార్కెట్ బొబ్బిలి వంతెన వద్ద భీమవరం, తాడేపల్లిగూడెం, ఏలూరు రహదారుల వెంబడి ఈ సీతాఫలాల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ముఖ్యంగా తూర్పుగోదావరి జిల్లాలకు చెందిన ఈ సీతాఫలాలు రుచిలో సిమ్లా యాపిల్‌ను మరిపిస్తాయి. దీని ధర సైతం ప్రస్తుతం యాపిల్ పండ్లను సైతం మించిపోయింది. గుజ్జుఎక్కువ, గింజ తక్కువగా ఉంటుంది. మెట్ట ప్రాంత సీతాఫలాలు అయితే గింజెక్కువ, గుజ్జు తక్కువ ఉంటుంది.



గణపవరంలో సీతాఫలాలు విక్రయిస్తున్న వ్యాపారి

అందుకే వినియోగదారులు తూర్పు గోదావరికి చెందిన సీతాఫలాలపై మక్కువ చూపుతున్నారు. ఒకప్పుడు విస్తారంగా సీతాఫలాల తోటలు అధికంగా ఉండేవి. జాతీయ రహదారుల పక్కన సీతాఫలాల తోటలు ఉండేవి. ప్రస్తుతం రియల్ ఎస్టేట్ పుణ్యమా తోటలు తగ్గిపోయాయి మెట్ట ప్రాంతాల్లో కూడా సీతాఫలాల తోటలు తగ్గుముఖం పట్టడంతో పండ్లకు డిమాండ్ ఏర్పడింది. మార్కెట్‌లో సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో ఇవి పుష్కలంగా లభిస్తాయి. ఏళ్ళ తరబడి సీతాఫలాల విక్రయాల ద్వారా స్థానికంగా జీవనోపాధి పొందుతున్నారు. మెట్టప్రాంతం, ఏజెన్సీ, తూర్పుగోదావరి రాజనగరంలో లభిస్తున్న సీతాఫలాలను కొనుగోలు చేసి ఇక్కడ మార్కెట్‌కు తీసుకొస్తున్నారు. ప్రస్తుతం సీతాఫలాలు డజను 150 నుంచి 300 వరకు సైజును బట్టి విక్రయాలు జరుగుతున్నాయి. అలాగే ఇక్కడ సీతాఫలాలు కొనుగోలు చేసి హైదరాబాదు, చెన్నై, లాంటి ప్రాంతాలకు బస్సుల మీద కూడా బంధువులకు పంపిస్తున్నారు.

### ఆరోగ్యానికి దివ్యౌషధం

సీతాఫలాల్లో బీ-6, విటమిన్ సీ, పొటాషియం, ఐరన్ పుష్కలంగా ఉంటుంది. మానసిక స్థితిని నియంత్రించడంలో సహాయపడుతుంది. మెదడును బలోపేతం చేస్తుంది. రోగనిరోధక శక్తిని పెంపొందిస్తుంది. ఈ సీజన్‌లో సీతాఫలాలు తింటే రోగాల బారిన పడకుండా కాపాడుతుంది. రక్తపోటును అదుపులో ఉంచుతుంది. జీర్ణవ్యవస్థను కాపాడుతుంది. రక్తహీనతతో బాధపడే వారికి ఈ పండు దివ్య ఔషధం. కీళ్ళ నొప్పులకు కూడా చెక్ పెడు తుంది. మలబద్ధకాన్ని నివారిస్తుంది. ఈ పండులో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయని వైద్యులు చెబుతున్నారు.

## క్రైమ్ కార్నర్



### ఆటోను ఢీకొట్టి వ్యాన్ బోల్తా ..ఇద్దరికి గాయాలు

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 2 : జంగారెడ్డిగూడెం ఎస్సార్ పెట్రోల్ బంక్ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఇద్దరికి గాయాలయ్యాయి. కొయ్యలగూడెం మండలం బయ్యనగూడెం గ్రామానికి చెందిన వెంకటేశు, జోగి రాఘవులు బుధవారం ఉదయం కూలీ పని నిమిత్తం జంగారెడ్డిగూడెం మండలం వేగవరం గ్రామానికి ఆటోలో వెళ్తున్నారు. ఎస్సార్ బంక్ వద్దకు వచ్చేసరికి రాజమండ్రి వైపు వెళుతున్న ఐషర్ వ్యాన్ వేగంగా వచ్చి ఆటోను ఢీకొట్టి రోడ్డుపై బోల్తా పడింది. ఆటోలో ఉన్న వెంకటేశు, జోగి రాఘవులకు తీవ్రగాయాలవగా ఆటో డ్రైవరుకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్సుకు సమాచారమివ్వగా అంబులెన్సులో ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఆసుపత్రి అవుట్ పోస్టు పోలీసు సిబ్బంది బాధితుల నుంచి వివరాలు సేకరించారు.

### 40 వేల కిలోల చికెన్ వ్యర్థాలు స్వాధీనం

పెదపాడు, అక్టోబరు 1 : చేపల చెరువుల్లో మేతగా వేసేందుకు సుదూర ప్రాంతాల నుంచి కుళ్లిన చికెన్ వ్యర్థాలను మండలంలోని పలు గ్రామాల్లోని చేపల చెరువులకు తరలిస్తున్నారనే సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి నాలుగు ఐషర్ వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లుగా పెదపాడు ఎస్సై కట్టా శారదా సతీష్ తెలిపారు. పలు చోట్ల నిర్వహించిన తనిఖీల్లో వాహనాలతో పాటుగా వాహనాల్లోని (ఒక్కొ వాహనంలో 10 టన్నులు) సుమారు 40 వేల కిలోల చికెన్ వ్యర్థాలను స్వాధీనం చేసుకుని వాటిని గ్రామాలకు దూరంగా గొయ్యి తీసి పూడ్చి పెట్టించినట్లుగా తెలిపారు. చికెన్ వ్యర్థాల రవాణాను అడ్డుకునేందుకు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటున్నట్లుగా తెలిపారు. వాహన, చెరువు యజమానులతో పాటుగా వాహన డ్రైవర్లపై పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బొర్రంపాలెంలో విచారణకు వచ్చిన డీఎస్పీ వెంకటేశ్వరావు

### బొర్రంపాలెంలో అట్రాసిటీ కేసు విచారణ

టి.నరసాపురం, అక్టోబరు 2: మండలంలోని బొర్రంపాలెంలో బుధవారం పోలవరం డీఎస్పీ వెంకటేశ్వరరావు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు విచారణ నిర్వహించారు. గతనెల 22న గ్రామానికి చెందిన తోట ప్రసాద్ మరికొందరు అదే గ్రామానికి చెందిన ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారిని కులం పేరుతో దూషించారని గ్రామస్థులు ఆందోళన చేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసిన పోలీసులు గ్రామంలో విచారణ చేపట్టారు. ఇరువర్గాల వారిని విచారించి వివరాలు సేకరించారు. ఆయన వెంట ఎస్సై ఎం.జయబాబు ఉన్నారు.

### హెడ్‌కానిస్టేబుల్,హోంగార్డులపై దాడి

ఏలూరు క్రైం, అక్టోబరు 2 : రాత్రి గస్తీ విధి నిర్వహణలో ఉన్న హెడ్ కానిస్టేబుల్‌పై ముగ్గురు వ్యక్తులు దాడిచేయగా అటు వెళ్ళిన హోమ్ గార్డుపై కూడా దాడి చేశారు. ఈ సంఘటన పెదపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో ఈనెల 1వ తేదీ అర్ధరాత్రి జరిగింది. పెదపాడు పోలీస్ స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ చింతపల్లి కృష్ణ ఆసుపత్రి వైద్యులకు ఇచ్చిన సమాచారం మేరకు పెదపాడు పోలీస్ స్టేషన్‌లో ఈనెల 1వ తేదీ రాత్రి 9 గంటల సమయం నుంచి గస్తీలో ఉన్నారు. అతనితో పాటు హోంగార్డు నాగేశ్వరరావు కూడా ఉన్నారు. అర్ధరాత్రి 1 గంట సమయంలో తాళ్ళమూడి గ్రామ సమీపంలో ఉన్న భారత్ పంజాబీ దాబా దగ్గర గొడవ జరుగుతుందని సమాచారం అందడంతో వీరిద్దరూ అక్కడికి వెళ్ళారు. అక్కడ ముగ్గురు వ్యక్తులు గొడవ చేస్తుండగా ఎందుకు ఈ సమయంలో ఇక్కడ గొడవ చేస్తున్నారని అడగడంతో ఆ ముగ్గురు కలిసి హెడ్‌కానిస్టేబుల్‌ను కొట్టారు. అడ్డువెళ్ళిన హోంగార్డు నాగేశ్వరరావును కూడా రాళ్ళతో కొట్టారు. వారిని అదుపులోకి తీసుకోవాలని ప్రయత్నించినా ముగ్గురు కొట్టి పారిపోయారు. దాడికి పాల్పడింది తాళ్ళమూడికి చెందిన కంభం విజయ్, కంభం అజయ్, కంభం జగదీష్‌లుగా గుర్తించారు. గాయాలైన హెడ్ కానిస్టేబుల్ కృష్ణ ఏలూరు ప్రభుత్వాసుపత్రికి వచ్చి చికిత్స పొందారు. ఈ సంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

### చికిత్స పొందుతూ ఒకరి మృతి

పెదపాడు, అక్టోబరు 2 : దెందులూరు మండలం కొవ్వలి గ్రామానికి చెందిన కీర్తి సుధీర్‌బాబు మంగళవారం ఏపూరు వద్ద గడ్డి మందు తాగి అపస్మారక స్థితికి వెళ్లడంతో చికిత్స నిమిత్తం తొలుత ఏలూరు ప్రభుత్వాసుపత్రికి, అక్కడి నుంచి విజయవాడకు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



చోరీ జరిగిన ఇంట్లో పరిశీలిస్తున్న ఎస్ఐ నాగరాజు

### ఆకివీడులో చోరీ..బంగారం, నగదు అపహరణ

ఆకివీడు, అక్టోబరు 2 :ఇంటి తాళాలు పగలకొట్టి బంగారం, వెండి, నగదు చోరీ చేశారు. ఆకివీడు సాలిపేటలో బత్తులు జీవరత్నం, వనజలు సుమారు 26 ఏళ్ల నుంచి అద్దెకు ఉంటున్నారు. వనజ మెప్మా యానిమేటరుగా పని చేస్తున్నారు. ఇటీవల తాళ్ళకోడులో ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో ఇల్లు నిర్మించుకొని అక్కడ ఉంటున్నారు. పెద్ద కుమారుడు పవన్, భార్య సాలిపేటలో ఉంటున్నారు. పవన్ భార్య కోచింగ్ కోసమని వేరే ఊరు వెళ్లింది. వనజ మంగళవారం డ్వాక్రా సొమ్ము నగదు రూ.68 వేలు వసూలు చేసి పవన్ ఉంటున్న ఇంట్లో పెట్టి తాళాలు వేసుకొని వెళ్లిపోయింది. బుధవారం మెప్మా కార్యాలయంలో గాంధీజీ జయంతి వేడుకల్లో పాల్గొని సాలిపేట ఇంటికి వెళ్లేసరికి ఇంటి తాళం పగలు కొట్టి ఉంది. బీరువాలో ఉండాల్సిన నగదు రూ.68 వేలు, నాలుగు కాసులు బంగారు వస్తువులు, వెండి వస్తువులు లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ నాగరాజు వచ్చి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు, ఆచార్యులు

## ఏపీ నిట్‌లో గాంధీ జయంతి

తాడేపల్లిగూడెం అర్బన్, సెప్టెంబరు 2 : మహనీయుల ఆశయాలను ప్రతీ ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఏపీ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పీ.దినేష్ శంకర్ రెడ్డి అన్నారు. బుధవారం నిట్ ప్రాంగణంలో జాతిపిత మహాత్మా గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వారి విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ డాక్టర్ జీబీ వీరేష్‌కుమార్, అసోసియేట్ డీన్‌లు డాక్టర్ కిరణ్‌తీపర్తి, డాక్టర్ సందీప్, ఆచార్యులు డాక్టర్ రాముడు పాల్గొన్నారు.



పెదనింద్రకొలను గాంధీ భవనంలో సర్వోదయ మండలి నిర్వహించిన పోటీల విజేతలకు బహుమతులు పంపిణీ

## పెదనింద్రకొలనులో శాంతి ర్యాలీ

నిడమర్రు అక్టోబరు 2 : మహాత్మాగాంధీ సిద్ధాంతాలైన సత్యం, అహింస, సత్యాగ్రహం, స్వచ్ఛత విధానాలను ప్రతిఒక్కరూ ఆచరించాలని జిల్లా సర్వోదయ మండలి ప్రధాన కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు అన్నారు. బుధవారం గాంధీ జయంతి సందర్భంగా పెదనింద్రకొలను గాంధీ భవన్‌లో గాంధీ విగ్రహనికి క్షీరాభిషేకం చేసి అనంతరం పూలమాలలు వేశారు. సర్వమత ప్రార్థనలు నిర్వహించి గాంధీకి ఘనమైన నివాళులర్పించారు. గాంధేయవాదులు కొండ్రెడ్డి సర్వేశ్వరరావు (ఉంగుటూరు) రుద్రరాజు బంగారాజు (పత్తేపురం)లను ఘనంగా సత్కరించారు. పాఠశాల విద్యార్థులకు గాంధీ జీవితచరిత్రపై జిల్లాస్థాయిలో వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. పెదనింద్రకొలనులో శాంతి ర్యాలీ నిర్వహించారు. గాంధీ స్మారక నిధి చెర్మన్ కాజా పూర్ణ చంద్ర గాంధీ, పెదనింద్రకొలను సర్పంచ్ ముగ్గళ్ళ యాకోబు, గాంధేయవాదులు సాగిరాజు జానకిరామరాజు, ఆర్.వి.ఎస్.రాజు, మంత్రబుడ్డి అప్పారావు, గట్టిం మాణిక్యాలరావు, శరణాల మాలతీరాణి, కొచ్చర్లపాటి సుబ్బరాజు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



గరగపర్రులో ఇరు వర్గాలతో చర్చిస్తున్న పోలీసు, రెవెన్యూ, పంచాయతీ, గ్రామ పెద్దలు

## గరగపర్రులో శ్మశాన వాటిక వివాదం

### రోడ్డుపై బైఠాయించిన ఇరు వర్గాలు

పాలకోడేరు, అక్టోబరు 2: గరగపర్రులో రెండు వర్గాల మధ్య వివాదం చెలరేగింది. శ్మశాన వాటికకు ప్రధాన రహదారి నుంచి వెళ్ళేందుకు రహదారి ఇవ్వాలంటూ దళితులు రోడ్డక్కగా ఆ ఖాళీ స్థలం మసీదు కోసం ఉపయోగిస్తున్నట్లుగా ముస్లింలు చెబుతున్నారు. ఇరువర్గాల మధ్య వివాదం తారస్థాయికి వెళ్ళింది. భీమవరం నుంచి తాడేపల్లిగూడెం వెళ్ళే రహదారిలో రహదారిని చేర్చి గరగపర్రు గ్రామానికి నాలుగు ఎకరాల 58 సెంట్ల శ్మశాన వాటిక ఉంది. దీనిలోనే ఇరిగేషన్, ఆర్అండ్‌బీ పోరంబోకు ఉంది. ఒకటిన్నర ఎకరాలు సబ్ డివిజన్ చేసి కొన్ని సంవత్సరాల క్రితం కొంతమంది లబ్ధిదారులకు ఇళ్లస్థలాలుగా ఇచ్చారు. అక్కడే ఆ రహదారిని చేర్చి కొంత మంది స్థలాన్ని ఆక్రమించి సుమారు 30 సంవత్సరాలుగా ఇళ్ళు కట్టుకుని నివసిస్తున్నారు. అయితే దళితులకు చెందిన శ్మశాన వాటికకు వెళ్ళే రహదారి కొంత మేర పాడవటంతో ఆర్అండ్‌బీ రహదారిని చేర్చి రెండుమూడు చోట్ల ఖాళీస్థలాలు ఉన్నాయి. ఈ స్థలాలు తమవేనంటూ శ్మశానానికి వెళ్ళేందుకు దారి వేసుకుంటామంటూ దళితులు బుధవారం ఉదయం ఎక్స్ కవేటర్లు తీసుకొచ్చి దారి వేసేందుకు పూనుకున్నారు. అక్కడ ఉంటున్న ముస్లింలు ఈ స్థలాన్ని మసీదు కోసం వినియోగించుకుంటున్నామని ఇలా దౌర్జన్యం చేయడం మంచిపద్ధతి కాదంటూ వారు కూడా రోడ్డుపై బైఠాయించారు. దీంతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. తాడేపల్లిగూడెం వెళ్ళే రహదారిలో కొంతసేపు ట్రాఫిక్ జామ్ అయింది. ఇది తెలుసుకున్న రూరల్ సీఐ బి.శ్రీనివాసరావు, టౌన్ సీఐ కాళీచరణ్, ఆర్ఐ రాఘవరాజు, పంచాయతీ, రెవెన్యూ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని ఇరువర్గాలతో మాట్లాడారు. అయినా సమస్య కొలిక్కి రాకపోవడంతో ఇరుపక్షాల పెద్దలతో గ్రామ పంచాయతీలో సమావేశం ఏర్పాటు చేశారు. అయితే ఈ సమావేశంలో దళితులు స్థలాన్ని సర్వే చేసి తమ స్థలాన్ని తమకు అప్పజెప్పాలని కోరారు. అదేవిధంగా ముస్లింలు సైతం తామంతా ఇక్కడ అన్నదమ్ములుగా ఉంటున్నామని మసీదులో ప్రార్థనలు జరుపుకుంటున్నామని ఆ స్థలం తమదేనంటూ వాదించారు. దీంతో అధికారులు కలగజేసుకుని సర్వే చేపడతామని చెప్పడంతో గొడవ ప్రస్తుతానికి సద్దుమణిగింది.

### 48 ఆవుదూడలు స్వాధీనం

పెదపాడు, అక్టోబరు 2: జాతీయ రహదారిపై పెదపాడు మండలం కలపర్రు టోల్‌గేట్ సమీపంలో తనిఖీలు నిర్వహించి అక్రమంగా వ్యానులో తుని నుంచి చిలకలూరిపేటకు తరలిస్తున్న 48 ఆవుదూడలను స్వాధీనం చేసుకున్నట్లు పెదపాడు ఎస్సై కట్టా సతీష్ తెలిపారు. ఆవుదూడలను గోసంరక్షణ కేంద్రానికి అప్పగించి పెదపాడు పోలీసులు కేసు నమోదు చేశారు.

## పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

మొగల్తూరు, అక్టోబరు 2: పర్యావరణ పరిరక్షనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. గత నెలలో పేరుపాలెం తీరంలో స్వచ్ఛ సాగర్-సురక్షిత సాగర్ కార్యక్రమం నిర్వహించిన ఇంక్వాయిస్ సంస్థకు చెందిన శాస్త్రవేత్త బుర్ర శివయ్య, మత్యకార సంక్షేమ సమితి రాష్ట్ర గౌరవాధ్యక్షుడు శ్రీనివాస ఆర్జున్ కుమార్, మొగల్తూరులోని పారిశుధ్య కార్మికుడు పెదారి ఏసుబాబులకు కేంద్ర మంత్రి వర్మ, కలెక్టర్ నాగరాణి, పలువురు ఎమ్మెల్యేలు శాలువా కప్పి ప్రశంసాపత్రాలు అందించారు. గాంధీ జయంతి సందర్భంగా భీమవరంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో వీరిని సన్మానించారు. శాస్త్రవేత్త బి.శివయ్య హాజరుకాని కారణంగా ఆయన సతీమణి సూర్యకుమారికి ప్రశంసాపత్రాన్ని అందించారు.

## జిల్లా స్థాయి పోటీలలో విద్యార్థుల ప్రతిభ

ఉండి అక్టోబరు 2: భీమవరంలో జరిగిన స్వచ్ఛత దివాస్ సభలో హెచ్ఐవీపై జరిగిన క్విజ్ పోటీలో జిల్లా స్థాయిలో ప్రథమస్థానం పొంది రూ.5 వేల చెక్‌ను, ప్రశంసాపత్రాన్ని కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ, కలెక్టరు నాగరాణి చేతుల మీదుగా చెరుకువాడ విద్యార్థులు అందుకున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## గ్రామ సభ దృష్టికి సమస్యలు

పెనుగొండ, అక్టోబరు 2: గ్రామ సమస్యలను గ్రామ సభ దృష్టికి తీసుకు రావడం ద్వారా పరిష్కారం జరుగుతుందని సర్పంచ్ ఎస్.శ్యామలా సోని శాస్త్రి అన్నారు. పెనుగొండ పంచాయతీ ఆవరణంలో బుధవారం గ్రామసభ నిర్వహించారు. కార్యదర్శి రత్నాకర్, వి.రాము, పి.రవి కుమార్, కాకి ప్రభాకర్, ఎం.ప్రసాద్, ఆర్.సురేష్ పాల్గొన్నారు. వడలి పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామ సభలో గ్రామంలో చేపట్టబోయే ఉపాధి హామీ పనులను వివరించారు. పలు సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు.


పెనుగొండలో జరిగిన గ్రామ సభ

● ఉండి : అరేడులో సర్పంచ్ బ్రహ్మానందరెడ్డి అధ్యక్షతన గ్రామసభ జరిగింది. ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్ ఓమెగా రాజు మాట్లాడుతూ గ్రామాలలో పనులను గుర్తించి పనులు కల్పిస్తామన్నారు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పార్టీకి ద్రోహం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

ఆకివీడు రూరల్ అక్టోబరు 2 : ఎన్నికల సమయంలో ప్రతిపక్ష పార్టీకి మద్దతు పలికారని, అనంతనం టీడీపీ జెండా పట్టిన మాజీ ఉప సర్పంచ్ ఎం.రాజుపై చర్యలు తీసుకోవాలని ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు కుప్పనపూడిలో కూటమి నాయకులు కోరారు. ఉపసర్పంచ్ జె.గోపి, ఎం.త్రిమూర్తులు, ఎన్.రాందాసు, బి.కొండ, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కూటమి నేతలు

## జాతీయ రహదారిపై నిలిచిన ట్రాఫిక్

ఆకివీడు, అక్టోబరు 2 : స్థానిక మెయిన్ సెంటర్ నుంచి గుమ్ములూరు సెంటర్ వైపు వెళ్లుతున్న ట్రాక్టర్ ట్రక్ స్థానిక ఎస్ టర్నింగ్ మలుపు తిరుగుతుండగా ఊడిపోయి రోడ్డుపై నిలిచిపోయింది. ఎటువంటి ప్రమాదం జరగలేదు కాని ట్రాఫిక్ నిలిచింది. పోలీసులు వచ్చి క్లీయర్ చేశారు.

## డాక్టర్ రఘునాధరాజు సేవలు అనిర్వచనీయం

ఆకివీడు, అక్టోబరు 2 : వైద్యులు ఎం.రఘునాదరాజు వర్ధంతి సందర్భంగా స్థానిక ఎస్-టర్నింగ్‌లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీకి ఆయన అభిమానులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రామరాజు వేర్ హౌస్ అధినేత కేఆర్‌కే మూర్తి రాజు ఆర్థిక సహాయంతో పేదలకు చీరలు, భోజనం పొట్లాలు పంచారు. టీడీపీ నేతలు కె.నాగరాజు, వైడీవీ ప్రసాద్, పి.నాగరాజు, ఉన్నారు.

## మహిళలకు చీరల పంపిణీ

ఉండి అక్టోబరు 2: స్థానిక రాజులపేటలోని కూనపరాజు అప్పలరాజు సీతమ్మ లయన్స్ ఆడిటోరియంలో బుధవారం గాంధీ జయంతి సందర్భంగా 50 మంది వృద్ధ మహిళలకు చీరలు పంపిణీ చేశారు. యూనియన్ బ్యాంక్ మేనేజరు సిబ్బంది, వ్యాపారవేత్త లయన్ బి.కేశవరావుల ఆర్థిక సహాయంతో ఈ కార్యక్రమంను నిర్వహించారు. పారిశ్రామికవేత్త లయన్ ఎస్.బ్రహ్మారెడ్డి, బ్యాంక్ అసిస్టెంట్ మేనేజరు ఫణికుమార్, కేశవరావు, లయన్స్ ఎం.విజయ, ఆర్.నరసరాజు, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే బొలిశెట్టి బావమరిది మృతి

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 1: తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ బావమరిది, కొత్తూరుకు చెందిన తిరుమళ్ల వెంకటేశ్వరరావు (60) బుధవారం హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన మృతికి కొత్తూరు సర్పంచ్ కూడవల్లి హనుమంతు, ఎంపీటీసీ ఉప్పు నరసింహ మూర్తి, జనసేన నాయకులు చిక్కాల శ్రీనివాస్ సంతాపం తెలిపారు.


టి.వెంకటేశ్వరరావు (ఫైల్)

## విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి


బాలుర వసతి గృహం తనిఖీ చేస్తున్న న్యాయాధికారి సత్యవతి

తణుకు, అక్టోబరు 2: వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని నాల్గో అదనపు జిల్లా న్యాయాధికారి డి.సత్య వతి అన్నారు. తణుకులోని బాల సదన్ చిల్డ్రన్ హోమ్, గుడ్ సమరిటన్ చిల్డ్రన్ హోమ్, స్పందన మానసిక వికలాంగుల హోం, ప్రభు త్వ బాలుర వసతి గృహాలను బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి భవనాలు, కిచెన్, గదులు, తాగు నీరు, మరుగుదొడ్లను పరిశీలించారు. నివేదికను రాష్ట్ర లీగల్ సర్వీస్ కమిటీకి అందిస్తామని వివరించారు. మొదటి జూనియర్ సివిల్ న్యాయాధికారి రంజిత్ కుమార్, న్యాయవాదులు కె.వెంకటేశ్వర్లు, అజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## చెకుముఖి పోటీల్లో భాష్యం విద్యార్థుల ప్రతిభ

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 2: తాడేపల్లి గూడెం భాష్యం పబ్లిక్ స్కూల్ విద్యార్థులు మండల స్థాయి చెకుముఖి టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ చూపారు. ప్రతిభ కనబరిచిన రొక్కం నిహాస్, ఎస్. కార్తికేయ. పి.శ్రీచందనను జోనల్ ఇన్‌చార్జ్ శ్రీమన్నారాయణరెడ్డి, ప్రిన్సిపాల్ రమేష్, లిటిల్ చాంప్స్ ప్రిన్సిపాల్ ఆర్. కళ్యాణి అభినందించారు.



## గీత కార్మిక పాలసీ వెంటనే ప్రకటించాలి

తణుకు, అక్టోబరు 2: గీత కార్మిక పాలసీని సీఎం వెంటనే ప్రకటించాలని గీత కార్మికులు బుధవారం గాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు తహసీల్దార్ కార్యాలయం వద్ద గల గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు కామన మునిస్వామి మాట్లాడుతూ గీత కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం చేపడతామన్నారు. జి.వీరరాఘవులు, బి.సత్యనారాయణ, కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ చేయాలి

భీమవరం టౌన్,అక్టోబరు 2 : తిరుమల లడ్డూ అపవిత్రతపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేసి దోషులను కఠినంగా శిక్షించాలని, హిందూ దేవాలయాలను ప్రభుత్వ ఆధీనం నుంచి తపించి స్వతంత్ర ప్రతిపత్తి గల హిందూ ధార్మిక సంస్థకు అప్పగించాలని డిమాండ్ చేస్తూ గురువారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌కు వినతి పత్రం అందించారని కార్యదక్షుడు వి.వెంకటేశ్వర్లు తెలిపారు.





గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న ఉండిలో ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు, నరసాపురంలో మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, ఆకివీడు కొత్త బస్టాండ్ సమీపంలోని గాంధీజీ పార్కులో టీడీపీ నేతలు, ఆచంట తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ సోమేశ్వరరావు

# గాంధీ మార్గం అనుసరణీయం

### గాంధీజీ, లాల్ బహుదూర్ శాస్త్రికి ఘన నివాళులు

**గాంధీజీ, లాల్ బహుదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా జిల్లాలోని పలు నియోజకవర్గాలలో కూటమి నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, అధికారులు ఘన నివాళులర్పించారు. మహాత్మాగాంధీ మార్గం అనుసరణీయమని పలువురు వక్తలు కొనియాడారు.**

ఉండి, అక్టోబరు 2 : గాంధీ జయంతిని సందర్భంగా స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదురుగా ఉన్న గాంధీజీ విగ్రహానికి ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘు రామకృష్ణరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీజీ చేసిన సేవలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. జనసేన ఇన్‌చార్జి జుత్తుగ నాగరాజు, మండల టీడీపీ అధ్యక్షుడు కరిమెరక నాగరాజు, గ్రామ అధ్యక్షుడు కాగిత బుజ్జి, ఎంపీటీసీ కునుకు రమాదేవి శ్రీను, పొత్తూరి వెంకటేశ్వర రాజు, పోలుబోతు రాము, తదితరులుపాల్గొన్నారు.

● నరసాపురం టౌన్ : శివాలయం సెంటర్‌లోని గాంధీ విగ్రహానికి మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎ.వెంకట నరసయ్య, వీసీ కొత్తపల్లి నాని, వైఎస్ బాబులు, జి.మురళీ పాల్గొన్నారు. సబ్‌జైలు కార్యాలయంలో గాంధీ జయంతి నిర్వహించారు. న్యాయమూర్తులు గంగరాజు, కె.శ్రీనివాసులు జైలర్ టి.అప్పారావు, సి.బాలాజీ, తదిత రులు పాల్గొన్నారు. సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీవో దాస రాజు, మునిసిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ వెంకట రమణ, కమిషనర్ అంజయ్య , రుస్తుంబాదా ఐఎల్‌టీసీ లేసు కేంద్రంలో కన్వీనర్ కె.తులసీ స్వచ్ఛ భారత్ నిర్వహించారు. గాంధీ చిత్రపటాలకు పూలమా లలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శివాలయం సెంటర్‌లో ఉన్న గాంధీ విగ్రహానికి కె.బుజ్జీ, యూటీఎఫ్ నాయకులు సబ్‌రిజిస్ట్రర్ కార్యాలయం వద్దను న్న గాంధీ విగ్రహానికి తమ సమస్యల్ని పరిష్కరించా లంటూ వినతిపత్రం అందించారు.

● భీమవరం టౌన్ : హౌసిం గ్ బోర్డు కాలనీలోని గాంధీ విగ్రహం వద్ద కాలనీ అభివృద్ధి సంక్షేమ అసోసియేషన్ అధ్వర్యంలో మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతిని ఘనంగా నిర్వహించారు. సర్వోదయ మండలి అధ్వర్యంలో క్విట్ ఇండియా స్థూపం వద్ద లాల్ బహదూర్ శాస్త్రికి, మహా త్మాగాంధీకి నివాళుల్పరించారు. అభివృద్ధి కమిటీ అధ్యక్షు డు సి.రామారావు, కార్యదర్శి జె.మధుసూదన్‌రావు, వేంకటేశ్వరస్వామి దేవస్థాన అధ్యక్షుడు కె.వెంకటరాజు, కార్యదర్శి కె.బాల, సీహెచ్ రంగ సాయి, న్యాయవాది యు. రమేష్‌నాయుడు పాల్గొన్నారు.

● భీమవరం ఎడ్యుకేషన్ : శ్రీఆదిత్య డిగ్రీ కళాశాలలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళాశాల డైరెక్టర్ ఎం.శ్రీనివాస్ ప్రిన్సిపాల్స్ ఎ. అనురాధ, మావుళ్ళ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ బ్రహ్మం, విద్యార్థులు పాల్గొన్నారు.

● కాళ్ళ : కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కాళ్ళ పీహెచ్‌సీ వద్ద ఉన్న గాంధీజీ విగ్రహానికి పార్టీ ఉండి ఇన్‌చార్జీ వేగేశ్న గోపాలకృష్ణంరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదలకు, రోగులకు పండ్లు పంచిపెట్టారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

● పెనుగొండ : వాసవీ క్లబ్ మిత్రా ఆధ్వర్యంలో పెనుగొండ మెయిన్ రోడ్డులో గల గాంధీ బొమ్మల సెంటర్ వద్ద వాసవీ క్లబ్ మిత్రా అధ్యక్షుడు గ్రంధి అజయ్ చంద్రక్య గాంధీజీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. సభ్యులు పాల్గొన్నారు.

● ఆచంట : స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ ఎస్.సోమేశ్వరరావు, ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీపీ డి.సూర్య కుమారి, అలాగే ఆయా గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు అధికారులు గాంధి విగ్రహాలు, చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు.

● ఆకివీడు : గాంధీజీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా స్థానిక కొత్త బస్టాండ్ సమీపంలో ఉన్న గాంధీ పార్కులోని గాంధీజీ విగ్రహానికి, పార్టీ కార్యాలయంలో లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటానికి టీడీపీ మండల అధ్యక్షుడు ఎం.రామవరప్రసాద్ టీడీపీ నేతలతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు బొల్లా వెంకట్రావు, గంధం ఉమా, ఆర్యవైశ్యులు గుర్రం శ్రీనివాసరావు, నేరెళ్ళ రామ చెంచయ్య, సన్నిధి వెంకన్న, గొంట్లా సత్య నారాయణ, కృష్ణమూర్తి, లయన్స్ క్లబ్ సభ్యులు ఉన్నారు.


కలెక్టరేట్‌లో గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

● ఆకివీడు రూరల్ : చినకాపవరంలో గాంధీ విగ్రాహన్ని ఆవిష్కరించారు. జడ్పీటీసీ వైశ్రీను, సర్పంచ్ ఎన్.ఆదిలక్ష్మీ, బాలాజీ, సీహెచ్.శ్రీను పాల్గొన్నారు.

● మొగల్తూరు : మొగల్తూరు పంచాయతీ వద్ద సర్పంచ్ పడవల మేరీ, ఉప సర్పంచ్ బోణం నర్సింహ రావు, వార్డు సభ్యులు గాంధీజీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ముత్యాలపల్లి పంచాయతీ గెదళ్ళవంపులో టీడీపీ నాయకుడు ఎన్.రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పి.రామరాజు, మండల టీడీపీ అధ్యక్షుడు జి.నాగరాజు శాంతి ర్యాలీ నిర్వహించి మొక్కలు నాటారు. వి.ఉమామహేశ్వరరావు, ఎస్.వెంకటేశ్వర్లు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

● గణపవరం : అర్ధవరంలో తెలుగు యువత అధ్యక్షుడు ఎ.వాసురాజు, ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు మిఠాయిలు పంచారు. ప్రిన్సిపాల్ డాక్టర్ నిర్మల కుమారి, వైస్ ప్రిన్సిపాల్ మధురాజు, అధ్యాపకులు పాల్గొన్నారు. గణపవరంలోని మహాత్మాగాంధీ విగ్రహానికి పశ్చిమగోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వి.రామారావు, సభ్యులు నివాళులర్పించారు.

● తాడేపల్లిగూడెం రూరల్ : వెంకట్రామన్నగూడెం డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన వర్సిటీ ఆవరణలో కృషి విజ్ఞాన కేంద్రంలో గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జడ్పీ పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. కేవీకే ప్రధాన శాస్త్రవేత్త కరుణశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

● తాడేపల్లిగూడెం అర్బన్ : గాంధీజీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళుల ర్పించారు. కిలపర్తి వెంకట్రావు, పట్నాల రాంపండు, దాసరి అప్పన్న, గంధం సతీష్, బండారు వెంకట్రావు, బండి పెద్దిరాజు, దాట్ల జగన్నాథరాజు, ము త్యాల సత్యానారాయణ, పద్మనాభుని మురళి, వాడపల్లి సుబ్బ రాజు పాల్గొన్నారు. పెంటపాడు మండల పరిషత్ కార్యా లయ ప్రాంగణంలో ఎంపీపీ దాసరి హైమవతి, తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ ఏడిద శ్రీనివాస్, ఆయా పంచాయతీ కార్యాలయాల వద్ద సర్పంచ్‌లు గాంధీజీ, లాల్‌బహదూర్ శాస్త్రి విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● పాలకొల్లు టౌన్ : పట్టణంలోని గాంధీ బొమ్మ సెంటరు వద్ద ఉన్న గాంధీజీ విగ్రహానికి మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ పూలమాల వేసి నివాళులర్పించారు. పెచ్చెట్టి బాబు, గండేటి వెంకటేశ్వరరావు, కర్నేన రోజారమణి, కర్నేన గౌరునాయుడు, ధనాని సూర్య ప్రకాష్, బోనం చినబాబు, జక్కంపూడి కుమార్ పాల్గొన్నారు.

● తణుకు : ప్రతి ఒక్కరూ గాంధీ అహింసా మార్గాన్ని అనుసరించాలని కూటమి నాయకులు అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా తహసీల్దారు కార్యాలయం వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.




గాంధీ , లాల్ బహదూర్ శాస్త్రి విగ్రహాలు, చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న పెంటపాడులో వలవల బాబ్జి, తణుకులో కూటమి నాయకులు, పాలకొల్లులో మాజీ ఎమ్మెల్సీ రామ్మోహన్


మొగల్తూరు ముత్యాలపల్లిలో శాంతి ర్యాలీ

# సమాజ రక్షకులు ఉపాధ్యాయులే

### కేంద్ర మంత్రి వర్మ, ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం ఎడ్యుకేషన్, అక్టోబరు 2 : విద్యార్థులు సాధించిన విజయాలే ఉపాధ్యాయులకు ఎంతో ఆనందాన్నిస్తాయని కేంద్ర ఉక్కు. భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం కృష్ణదేవరాయ కళ్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ భీమవరం డివిజన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో భాగంగా డివిజన్‌లోని 50 మంది ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించారు. కేంద్ర మంత్రి వర్మ మాట్లాడుతూ సమాజ దేవాలయానికి నిజమైన రక్షకుడు ఉపాధ్యాయులేనని అన్నారు. ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ గురువును దైవం కంటే మిన్నగా ఆరాధించే సంస్కృతి మనదన్నారు. పిల్లల్లో జ్ఞాన విత్తనాన్ని నాటిన రైతు ఉపాధ్యాయుడని, గురువు విద్యార్థుల జీవితాలలో వెలుగు అని, శిష్యుల ఎదుగదలే గురు దక్షిణగా భావించే ఒకే ఒక వ్యక్తి ఉపాధ్యాయులన్నారు. అనంతరం భీమవరం డివిజన్‌లోని 50 మంది ఉత్తమ ఉపాధ్యాయులను కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ, ఎమ్మెల్యే అంజిబాబు, టీడీపీ రాష్ట్ర నాయకులు మెంటే పార్థసారథి సత్కరించారు. ఏపీ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు వి.సుందర్‌రామ్, వి.మాణిక్యాల రావు, మామిడిశెట్టి ఏడుకొండలు, హరిసింగ్, నందమూరి రాజేష్, సుభద్రాదేవి, దుర్గాంజలి, టి.రవి, కురెళ్ళ నరసింహరావు, గంధం శ్రీదేవి పాల్గొన్నారు.


ఉపాధ్యాయుడిని సత్కరిస్తున్న కేంద్ర మంత్రి వర్మ, ఎమ్మెల్యే అంజిబాబు

# పవన్ ఆశయ సాధనకు కృషి చేద్దాం

కాళ్ళ, అక్టోబరు 2 : జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని జనసేన ఉండి ఇన్‌చార్జీ జుత్తిగ నాగరాజు కోరారు. జనసేన విస్తృత స్థాయికార్యకర్తల సమావేశం బుధవారం బొండాడలో నిర్వహించారు. తొలుత బొండాడ, బొండాడపేట, ఎల్ఎన్‌పురం గ్రామాల్లో నూతనంగా ఏర్పాటు చేసిన జనసేన పార్టీ జెండా స్థూపాలను ఆవిష్కరించారు. అనంతరం పార్టీ మండల అధ్యక్షుడు ఎరుబండి రామాంజనేయులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఈ సందర్భంగా మూడు గ్రామాలకు చెందిన వైసీపీకి చెందిన నాయకులు రుద్ర వెంకటరావు, తానింకి రాము, పచ్చిగోళ్ళ ఆంజనేయులు, కందుల సురేష్, మందపాటి సోమన్న, కొరసేక నాగరాజు, గుడ్ల సతీష్‌తో పాటు సుమారు 250 మంది నాయకులు నాగరాజు సమక్షంలో జనసేనలో చేరారు. నాగరాజు మాట్లాడుతూ నూతనంగా పార్టీలోకి వచ్చిన వారంతా రానున్న రోజుల్లో పార్టీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం రావడానికి కీలకపాత్ర వహించిన పవన్ కళ్యాణ్ దేశ రాజకీయాలు తనవైపు చూసేలా చేశాడన్నారు. పంచాయితీలకు పూర్వవైభవం తీసుకొచ్చి గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. మ్యానిఫెస్టోలో చెప్పిన ప్రతీ హామీలను కూటమి ప్రభుత్వం ఖచ్చితంగా అమలు పరుస్తోందన్నారు. గాదం నానాజీ, గవర లక్ష్మీ, దారపురెడ్డి కన్నబాబు, మేకా కాశీచరణ్, గడి రాము, అరేటి దిలీప్, నంద్యాల శివ, అరిటాకుల సత్యనారాయణ, జడ్డు శ్రీనివాస్, గుడ్ల మధు, తదితరులు పాల్గొన్నారు.


జనసేనలో చేరుతున్న వైసీపీ నాయకులను ఆహ్వానిస్తున్న జనసేన ఉండి ఇన్‌చార్జి నాగరాజు

## వరద బాధితులకు విరాళాలు


కలెక్టర్ నాగరాణికి చెక్కు అందజేస్తున్న నేతలు

తణుకు, అక్టోబరు 2: ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర శాఖ పిలుపు మేరకు జిల్లా ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల నుంచి వరద బాధితుల సహాయార్థం సేకరించిన రూ. లక్ష 245లు చెక్కును జిల్లా కలెక్టరు జి.నాగరాణికి అందజేశారు. సర్వశిక్ష ఏపీసీ కొల్లి శ్యామ్ సుందర్, రాష్ట్ర ప్రధానోపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు నేలపాటి వెంకటరమణ, గౌరవాధ్యక్షుడు మల్లువలస నాగ శ్రీమన్నారాయణ, కోశాధికారి బండి ఆంజనేయులు పాల్గొన్నారు.

## చంద్రబాబుకు చెక్కును అందజేసిన మురళి


సీఎం చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న మురళీ

తాడేపల్లిగూడెం అర్బన్, అక్టోబరు 2 : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును వాసవి ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్, ప్రముఖ వ్యాపారవేత్త చలంచర్ల మురళి బుధవారం సెక్రటే రియట్ వద్ద మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం విజయవాడ వరద బాధితుల సహా యార్థం చెక్కును అంద జేశారు. మురళిని చంద్ర బాబు అభినందించారు.

## జగన్‌ను కలిసిన వైట్ల కిశోర్

ఆచంట, అక్టోబరు 2 : వైసీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్మోహనరెడ్డిని బుధవారం తాడేపల్లిలో వైసీపీ రాష్ట్ర యువజన కార్యదర్శి వైట్ల కిశోర్ కుమార్ మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి వేంకటేశ్వర స్వామి జ్ఞాపికను అందజేశారు. జగన్ మాట్లాడుతూ ప్రతీ కార్యకర్తకు, నాయకుడికి అండగా ఉంటానని పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. మండల పార్టీ ప్రధాన కార్యదర్శి మనవర్తి విజయ్ కుమార్, మడిమెట్ల నరేష్ తదితరులు ఉన్నారు.


జగన్‌కు శ్రీవారి ఫోటోను అందజేస్తున్న వైట్ల కిశోర్

## నేటి నుంచి దసరా ఉత్సవాలు ప్రారంభం

### ముస్తాబైన ఆలయాలు

భీమవరం టౌన్, అక్టోబరు 2 : దేవీ నవరాత్రులకు ఆలయాలు ముస్తాబయ్యాయి. శ్రీరాంపురం లోని జగన్నాత కనకదుర్గ అమ్మవారి 33వ శరన్నవరాత్రి మహోత్సవాల బ్రోచర్‌ను పెయింటర్స్ అండ్ ఆర్టిస్టు వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.సత్యనారాయణ, కార్యదర్శి పి.రంగారావు, ఉపాధ్యక్షుడు జి.మల్లిఖార్జునరావు, సహాయ కార్యదర్శి జి.వీరస్వామి, కోశాధికారి పి.దుర్గారావు బుధవారం ఆలయ ప్రాంగణంలో ఆవిష్కరించారు. ప్రతిరోజూ సామూహిక కుంకుమార్చన, లలితా సహస్ర స్తోత్ర పారాయణం జరుగుతాయని తెలిపారు. బ్రహ్మజ్యోసుల సుబ్రహ్మణ్యం, బ్రహ్మజ్యోసుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● పెనుగొండ, అక్టోబరు 2: శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలను గురువారం నుంచి ఈ నెల 12 వరకు నిర్వహించనున్నట్లు మహిషాసురమర్దిని, వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ ఈవో జి.రామపెద్దింట్ల రావు తెలిపారు.

● ఆచంట : ప్రసిద్ధి చెందిన పెదమల్లం మాచేనమ్మ ఆలయం వద్ద అలాగే ఆచంట రామేశ్వరస్వామి ఆలయం వద్ద శరన్నవరాత్రి మహోత్సవాలు నిర్వహిం చేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఈవో ఏవీ సత్యనారాయణ తెలిపారు.


మావుళ్ళమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన విద్దీదపాలంకరణ

● గణపవరం : గణపవరం మండల గ్రామాల్లో గురువారం నుంచి దేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు ఆలయాలు, మందిరాలు ముస్తా బయ్యాయి. విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువచ్చి మందిరాల్లో ప్రతిష్టిస్తు న్నారు. గణపవరం, సరిపల్లె, అర్ధవరం, పిప్పర, కేశవరం, మల్లపురాజుపేట, జల్లికాకినాడ, గ్రామాల్లోని వేడుకలకు ఆలయాలు, మందిరాలు ముస్తా బయ్యాయి. ఆలయాలు విద్యుత్ దీపాలతో అలంకరించారు.

## నేడు ట్రస్టు ఆస్పత్రికి ప్రత్యేక వైద్యులు రాక

పెంటపాడు, అక్టోబరు 2: అలంపురం ట్రస్టు ఆస్పత్రికి గురువారం రాజానగరం జీఎస్ఎల్ ఆస్పత్రి నుంచి ప్రత్యేక వైద్యులు వస్తున్నట్టు ట్రస్టు ఛైర్మన్ కె.పెదకృష్ణంరాజు తెలిపారు. ఎముకలు, కీళ్ళు, జనరల్ సర్జన్, చర్మ వ్యాధులు, ఊపిరితిత్తులు, చెవి, ముక్కు, గొంతు సంబంధ వైద్యులు ఉచితంగా వైద్య సేవలు అందిస్తారన్నారు.

## ఉపాధ్యాయుల సత్రాగహ దీక్షలు

తణుకు, అక్టోబరు 2: మున్సిపల్ హైస్కూళ్లలో పనిచేస్తున్న ఉపాధ్యా యుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తణుకు పట్టణ మున్సిపల్ ఉపాధ్యాయులు బుధవారం ఎంఈవో కార్యాలయం వద్ద సత్యాగ్రహ దీక్షలు చేపట్టారు. ఖాళీగా ఉన్న హెడ్మాస్టర్, స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో అర్హులైన వారికి పదోన్నతి కల్పించాలంటూ తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## రైతులకు ఒరిగిందేమీ లేదు

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 2: కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనలో రైతులకు చేసిందేమీ లేదని వైసీపీ రైతు విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డి రఘురాం నాయుడు అన్నారు. తాడేపల్లిగూడెంలోని తన నివాసం వద్ద బుధవారం విలేకర్లతో మాట్లాడుతూ తనపై జగన్ నమ్మకం ఉంచి రైతు విభాగం బాధ్యతలు అప్పగించడంపై ఆయన కృతజ్ఞతలు తెలిపారు. జడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, ఎంపీపీ పి.శేషులత, పట్టణ నాయకులు జి.నాగు, ఎంపీటీసీలు ఎన్.నాగు, ఎం.సుబ్బారావు పాల్గొన్నారు.

## గాంధీ విగ్రహానికి నివాళి

అత్తిలి, అక్టోబరు 2 : బల్లిపాడు జడ్పీ హైస్కూలులో బీజేపీ నాయకుడు డి.ఆదినారాయణ సహాయంతో నిర్మించిన గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. సర్పంచ్ కె.బాలాజీ, జనసేన నాయకుడు బి.సోమేంద్ర తదితరులు పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గాంధీ,లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాల వేసి ఎంపీపీ ఎస్.నాగేశ్వరరావు నివాళులర్పించారు. ఎంపీడీవో ఎండీ అమీలు జమా, విస్తరణ అధికారి శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

### తణుకు లయన్స్ క్లబ్‌లో..

● తణుకు, అక్టోబరు 2: గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలు తణుకు లయన్స్ క్లబ్‌లో అధ్యక్షుడు సప్పా బలరామ్ అధ్యక్షతన నిర్వహించారు. బుధవారం క్లబ్ ఆవరణలో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## ఉచిత మధుమేహ నిర్ధారణ పరీక్షలు

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 2: తాడేపల్లిగూడెం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జనతా చారిటబుల్ ట్రస్ట్ 95 మందికి ఉచిత మధుమేహ నిర్ధారణ పరీక్షలు నిర్వహించింది. లయన్ గమిని సుబ్బారావు, గ్రంధి సత్యనారాయణ, ఎస్. శ్రీనివాస్, చిన్నం జగదీష్ తదితరులు పాల్గొన్నారు.